ప్రజాశక్తి

గురువారం 8 ఆగస్టు 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

పొంగుతున్న వాగులు

- ఉధృతంగా మునేరు, కట్టలేరు, లక్ష్మయ్య వాగు
- రాకపోకలకు అంతరాయం
- విజయవాడలో సొరంగం వద్ద విరిగిపడిన కొండ చరియలు
- పల్లపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు

ప్రజాశక్తి - వన్‌టౌన్, కంచికచర్ల, గంపలగూడెం : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. వర్షాల కారణంగా పలు పల్లపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. విజయవాడ చిట్టినగర్ సొరంగం వద్ద కొండ రాళ్లు విరిగిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈప్రాంతంలో నిత్యం వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు తిరుగుతుంటాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న నానుడు వర్షాలకు కొండ చరియలు నానిపోయి విరిగిపడుతున్నాయి. భారీ వర్షాలకు కొండ రాళ్లు విరిగిపడే ప్రమాదం ఉందని తెలిసినా విఎంసి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోలేదు. దీంతో వర్షం పడిందంటే కొండ ప్రాంతవాసులు భయంభయంగా జీవనం సాగిస్తున్నారు.

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు ప్రవాహానికి వరద నీరు రోడ్డుపై 5 అడుగుల మేర ప్రవహిస్తోంది. దీంతో కంచికచర్ల – చెవిటికల్లుకు రాకపోకలు నిలిచిపోయాయు. వాగు సమీప ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. చెవిటికల్లు రోడ్డు కోతకు గురై బిసి కాలనీలోకి వరద ప్రవాహం చేరింది. 20 రోజుల వ్యవధిలో ఈ వాగుకు వరద రావడం ఇది రెండోసారి. అలాగే వైరా, కట్టలేరు, మునేరుకు వరద చేరింది. కంచికచర్ల మండలం కీసర బ్రిడ్జి వద్ద ఈ మూడు వాగులు కలుస్తాయి. మోగులూరు వద్ద కృష్ణానదిలో కలిసే మునేరు వాగుకు వరద ఉధృతి పెరిగింది. విజయవాడ నగరం, కంచికచర్ల మండలంలోని పలు పల్లపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీ వర్షాల కారణంగా గంపలగూడెం మండలం కట్టలేరుపై రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనకు రెండు వైపులా రాకపోకలు వాహనాలు నిలిచిపోయాయి. అలాగే నెమలి–కొనిజర్ల మధ్య ఉన్న వాగుకు వరద ఉధృతి పెరగడంతో నెమలి శ్రీ వేణుగోపాల స్వామి వారి దైవదర్శనానికి కూడా రాకపోకలు నిలిచిపోయాయి.

(పూర్తి వివరాలు లోపలి పేజీల్లో)



విజయవాడ చిట్టినగర్ సొరంగం వద్ద విరిగిపడిన కొండరాళ్లు



కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు ఉధృతి



విజయవాడ భవానీపురంలో ఇళ్లలోకి చేరిన వర్షం నీరు



కంచికచర్ల మండలం మోగులూరు వద్ద కృష్ణానదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు



కృష్ణమ్మ పరవళ్లు

బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 1,51,948 క్యూసెక్కులు

ప్రజాశక్తి-విజయవాడ : కృష్ణానదికి ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద ఉధృతి కారణంగా ప్రకాశం బ్యారేజి నుండి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకూ వరద ఉధృతి ప్రతి గంటకూ పెరుగుతూనే ఉంది. రాత్రి 9 గంటల సమయానికి ఎగువ ప్రాంతం నుంచి బ్యారేజికి 1,51,948 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అదేస్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజికి చెందిన మొత్తం 70 గేట్లలో 50 గేట్లను మూడు అడుగులు, మరో 20 గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 1,37,450 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. అలాగే 14,498 క్యూసెక్కుల నీటిని కాల్వలకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజి నీటి మట్టం 12 అడుగులుగా ఉంది. ఉదయం నుంచి రాత్రి వరకు వరద ఉధృతిని పరిశీలిస్తే... ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో ఉదయం 7.30 గంటలకు 53,352 క్యూసెక్కులుగా ఉంది. 8 గంటలకు 56,977 క్యూసెక్కులు, 9 గంటలకు 64,227 క్యూసెక్కులు, 10 గంటలకు 84,102 క్యూసెక్కులు, 11.30 గంటలకు 1,09,477 క్యూసెక్కులు, మధ్యాహ్నం 12.30 గంటలకు 1,23,727 క్యూసెక్కులు, ఒంటి గంటకు 1,30,727 క్యూసెక్కులు, 3 గంటలకు 1,44,087 క్యూసెక్కులు, సాయంత్రం 6 గంటలకు 1,50,927 క్యూసెక్కులు, రాత్రి 9 గంటలకు 1,51, 948 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఉంది. వరద ఉధృతి మూడు లక్షల క్యూసెక్కుల వరకూ పెరిగే అవకాశం ఉందని అధికారులు వివరిస్తున్నారు.

భయపెడుతున్న డెంగ్యూ

17 మందికి వ్యాధి నిర్ధారణ

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

జూన్, జూలైల్లో అధికాంగా వర్షాలు కురిశాయి. అగస్టు మొదటి వారంలోనూ కొనసాగుతున్నాయి. దీంతో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల డ్రైన్లు, పల్లపు ప్రాంతాలు, మెరకచేయని ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండి పోయింది. ఈ నీటి నిల్వలు దోమల ఉధృతికి కారణమవుతున్నాయి. ఈక్రమంలోనే సీజనల్ వ్యాధులతోపాటు డెంగ్యూ జర్వం కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. జూన్‌లో ఐదు, జులైలో ఏడు కేసులు నమోదు కాగా, అగస్టులో ఇప్పటి వరకు అధికారికంగా ఐదు కేసులు నమోదయ్యాయి. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఏడిస్ ఈజిప్ట్ దోమకాటు వల్ల డెంగ్యూ జ్వరం సోకుతుంది. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, ఎముకల నొప్పులు, ఆకలి మందగించడం, శరీరంపై దద్దుర్లు, ముక్కు, మలం ద్వారా రక్తం పోవడం తదితర లక్షణాలు జ్వరం వచ్చిన వారిలో ఉంటాయి. జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు నిర్ధేశించిన లాబ్ పరీక్షల్లో నిర్ధారించిన డెంగ్యూ కేసులను మాత్రమే అధికారికంగా ప్రభుత్వం గుర్తిస్తోంది. వ్యాధి లక్షణాలు ఉన్నవారిలో ఎక్కువ మంది ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. డెంగ్యూ పేరు చెప్పకుండా ఈ లక్షణాలు కనిపించిన రోగుల్లో ప్లేట్‌లెట్లు తక్కువగా ఉన్నాయనే కారణాన్ని చూపుతూ ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. చికిత్సకు కొందరు రోగులను కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తున్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గీతాబాయి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

వర్షాకాలంలో నీటి నిల్వ ప్రాంతాలు దోమలు వృద్ధికి దోహదపడతాయి. వీటి నియంత్రణకు స్థానిక సంస్థలు తీసుకునే చర్యలతో పాటు ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఫ్రై డేను డ్రై డేగా పాటించాలి. ఇళ్లల్లోకి దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగ్యూ వ్యాధి కారక దోమ పగటి పూట కుడుతుంది. ఇది కుట్టకుండా శరీరాన్ని పూర్తిగా కప్పివుంచే వస్త్రాలు ధరించాలి.

చేనేత వస్త్రాలపై జిఎస్‌టి రద్దు చేయాలి

పార్లమెంట్లో బందరు ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని రద్దు చేయాలని బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఈ అంశంపైన పార్లమెంట్‌లో బాలశౌరి మాట్లాడుతూ చేనేత వస్త్రాలపై ఐదు శాతం జిఎస్‌టి విధించడంతో వృత్తిపై ఆధారపడి జీవించే కార్మికులకు నష్టం జరగుతోందని తెలిపారు. చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత వస్త్రాలపై పన్ను రద్దును కేంద్రం ప్రకటించాలన్నారు. చేనేతపై పన్ను రద్దు చేస్తే ఈ వృత్తిపై ఆధారపడి జీవించే వారికి మేలు జరుగుతుందన్నారు.

జిఎస్‌టిని వ్యతిరేకిస్తున్న నేతన్నలు

మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. పెడన, గూడూరు, చల్లపల్లి, ఘంటసాల తదితర మండలాలు కళంకారి, చేనేత వస్త్రాల తయారీకి ప్రసిద్ధి. చేనేతపై జిఎస్‌టితో మిల్లు వస్త్రాలతో పోటీపడలేని పరిస్థితి ఏర్పడిందని, విక్రయాలు మందగించి నష్టపోతున్నామని చేనేత సంఘాల నేతలు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్ను రద్దుపై వినతులు సమర్పించారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజల సామాజిక అవసరాలను దష్టిలో పెట్టుకుని గ్రామాల సమగ్రాభివద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అధికారులను ఆదేశించారు. గ్రామాల సమగ్రాభివద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై బుధవారం జిల్లా కలెక్టర్ జి.సృజన కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామాలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి రాబోయే మూడు సంవత్సరాలలో చేపట్టి పూర్తి చేయాల్సిన పనుల నివేధికను రూపొందించాలన్నారు. మౌలిక వసతులైన రహదారులు, డ్రెయిన్లు, వీధి దీపాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి దశల వారీగా కలర్ కోడ్‌లతో ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం చేపట్టి పూర్తి చేయాల్సిన పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. 2025 మార్చి నాటికి ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేసే లక్ష్యాన్ని దష్టిలో పెట్టుకోవాలన్నారు. ఈసమావేశంలో డ్వామా పీడీ జె. సునీత, పంచాయతీ రాజ్ ఎస్ఇ అక్కినేని వెంకటేశ్వరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డివి రమణ, జిల్లా పంచాయతీ అధికారి ఎన్.వి.శివ ప్రసాద్ యాదవ్, డిఆర్‌డిఏ పిడి కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పక్కన డ్వామా పీడీ జె.సునీత తదితరులు





9న 'క్విట్ కార్పోరేట్'ను విజయవంతం చేయండి

రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి-విజయవాడ

ఈనెల 9న జరిగే క్విట్ కార్పోరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు, కార్మిక సంఘాలు సమన్వయ సమితి పిలుపునిచ్చింది. బుధవారం విజయవాడలోని దాసరి భవనంలో రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం యన్టీఆర్ జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజినేయులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. నాడు స్వాతంత్ర పోరాటంలో విదేశీయులను తరిమికొట్టడం కోసం క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందని, ఆ ఉద్యమ స్పూర్తితో క్విట్ కార్పోరేట్ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులు కాపాడుకోవడం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈనెల 14వ తేదీ రాత్రి కార్మికుల జన జాగరణ ఆటపాట కార్యక్రమంతో కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం (దాసరి భవన్) కార్యదర్శి మలిన్నీడు యలమందరావు, సిఐటియు, జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటేశ్వరరావు, కె దుర్గారావు, సోమేశ్వరావు, వ్యవసాయ కార్మిక సంఘం యన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, రైతు కూలీ సంఘం నాయకులు యు వీరబాబు, ఐఎఫ్టియు నాయకులు కె పోలార్, ఎ రవి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి - భవానీపురం

గొల్లపూడిలో పోలీసులు పలువురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. గొల్లపూడి సారా కొట్టు సెంటర్, మసీదు వెనుక గల, హర్షిత టవర్స్‌లో బుధవారం ఏడుగురు పేకాట ఆడుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.24,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సిఐ ఉమా మహేశ్వరరావు తెలిపారు.

16 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ

మద్యం సేవించి వాహనాలు నడిపిన 16 మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు. 5వ ట్రాఫిక్ పోలీసులు బుధవారం మొత్తం 16 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి జి.లెనిన్ బాబు ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 13 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

అప్రమత్తంగా ఉండాలి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : బెంజ్ సర్కిల్ వద్ద వరద ముంపుకు గురయ్యే ప్రాంతాలను విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం పర్యటించి పరిశీలించారు. బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ కింద జరుగుతున్న గ్రీన్ బెల్ట్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పూర్ణానంద పేట ప్రాంతంలో పర్యటించి పారిశుద్ధ నిర్వహణ సక్రమంగా జరగకపోవడం గమనించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈపర్యటనలో విఎంసి అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏ ఎస్ ఎన్ ప్రసాద్, వి శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ రామ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



బిడ్డకు తల్లిపాలు మించిన ఔషదం లేదు

ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పుట్టిన బిడ్డకు తల్లిపాలకు మించిన ఔషదం మరోకటి లేదని, రోగనిరోధక శక్తికి తల్లిపాలు ఎంతో దోహదపడుతాయని తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దెరామ్మోహన్ అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో



బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నాటి నుండి 6 నెలల పాటు కేవలం తల్లిపాలను మాత్రమే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిష్యత్ మాజీ చైర్మన్ గద్దె అనూరాధ, జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారిణి జి.ఉమాదేవి మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సాముహిక సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో కార్పోరేటర్ ముమ్మనేని ప్రసాద్, మహిళ శిశు సంక్షేమ శాఖ సిడిపివో జి.మంగమ్మ, సూపర్‌వైజర్ రెహన బేగం పాల్గొన్నారు.

వయనాడ్ విపత్తు బాధితులకు సిపిఐ రూ.69,.615 సాయం

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక దాసరి భవన్‌లో బుధవారం సిపిఐ విజయవాడ నగర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పెన్మెత్స దుర్గాభవానీ పాల్గొన్నారు. వయనాడ్ విపత్తు బాధితుల సహాయార్థం సిపిఐ నగర సమితి తరపున రూ.69,616 పార్టీ రాష్ట్ర కార్యదర్శికి అందజేశారు.

ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించే వేడుకలకు త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన ఆదేశించారు. బుధవారం ఆమె...జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ హెచ్ఎం. ధ్యానచంద్ర, డ్వామా పీడీ, ఇన్చార్జి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి జె సునీతతో కలిసి కళాక్షేత్రాన్ని పరిశీలించారు.

ప్రైవేటు బస్సు బోల్తా

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : కృష్ణాజిల్లా కత్తివెన్ను మండలం ఎండపల్లి వద్ద కారును తప్పించపోయి ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడింది. దాసరి ట్రావెల్స్ బస్సు మొగల్తూరు నుండి హైదరాబాద్ వెళుతుండగా, ఈ ప్రమాదం జరిగింది. బస్సులో మొత్తం తొమ్మిది మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో ముగ్గురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. ఆయనను పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

సిపిని కలిసిన ఇన్‌స్పెక్టర్లు


ప్రజాశక్తి - విజయవాడ : నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబును బుధవారం నూతన ఇన్‌స్పెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన సాధారణ బదిలీల నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్లను వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. ఈనేపథ్యంలో సదరు నూతన ఇన్‌స్పెక్టర్లు సిపి కార్యాలయంలో సిపిని కలిశారు.

బాలికపై అత్యాచారం కేసులో ముగ్గురికి కఠిన కారాగార శిక్ష

ప్రజాశక్తి - విజయవాడ : బాలికపై అత్యాచారం చేసిన కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఒక్కొక్కరికి 20 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. 2019లో ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితులైన ఉత్తరాది గురు సాయి చంద్ర అలియాస్ సాయి, గొల్లా సాయి అలియాస్ మెంటల్ సాయి, పెయ్యల తరుణ్ కుమార్‌లకు విజయవాడ పోస్కో కోర్ట్ ఇన్చార్జి జడ్జి తిరుమల వెంకటేశ్వర్లు ఒక్కొక్కరికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.రూ.25 వేల జరిమానా విధిస్తూ గత నెల 29న తీర్పు వెల్లడించినట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలిపారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ గుజ్జుల నాగి రెడ్డి వాదనలు వినిపించగా ప్రస్తుత పశ్చిమ ఎసిపి మురళీకష్ణ రెడ్డి పర్యవేక్షణలో భవానీపురం, సిఎంఎస్ ఇన్‌స్పెక్టర్లు, వారి సిబ్బంది కోర్టులో సాక్షులను హాజరుపరిచారు. స్పెషల్ పిపిని, పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా సిపి అభినందించారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రభుత్వం అప్పగించిన పనులను నాణ్యత ప్రమాణాలు విధిగా పాటిస్తూ వేగవంతంగా నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కాంట్రాక్టర్లకు సూచించారు.బుధవారం పంచాయతీ రాజ్, జలవనరుల శాఖలు, గ్రామీణ నీటి సరఫరా(ఆర్డబ్ల్యూఎస్) విభాగంలలో చేపట్టిన వివిధ రకాల పనులకు సంబంధించిన కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు, మీకోసం సమావేశ మందిరం, జడ్పీ మీటింగ్ హాలులలో వేరువేరుగా సమావేశాలు నిర్వహించి పనుల పురోగతిపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో మంజూరై చేపట్టిన పనులను తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిధుల కొరత లేదని పూర్తి చేసిన పనులకు ఎప్పటికప్పుడు సకాలంలోనే చెల్లింపులు చేస్తామన్నారు. ఇందుకోసం సంబంధిత శాఖల ఇంజనీర్లు పనులు పూర్తికాగానే ఎలాంటి ఆలస్యం చేయకుండా పనుల రికార్డింగ్, చెక్కు మెజర్మెంట్, బిల్లు పాస్ ఆర్డర్, అప్లోడ్ వెంట వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని సూచిస్తూ అటువంటి వాటిని ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఏదైనా సమస్య ఉన్నా లేదా ఇంజనీర్లు సరిగా స్పందించకపోయినా గాని, బిల్లు సకాలంలో చెల్లింపు కాకపోయినా గాని తన దష్టికి తీసుకొని వస్తే వెంటనే వారి సమస్యను పరిష్కరించేందుకు కషి చేస్తానన్నారు.తన వద్ద ఎప్పుడు రిమోట్ హేమర్ ఉంటుందని దాంతో స్తంభాల పటిష్టతను గమనించడం జరుగుతుందన్నారు.బిల్లులు చెల్లింపు కాలేదని ఇంజనీర్లు వారి చుట్టూ కాంట్రాక్టర్లను తిప్పుకోరాదని హితవుపలికారు.ఈ సమావేశాలలో జిల్లా పోలీసు అధికారి ఆర్. గంగాధర్ రావు, పంచాయతీరాజ్ ఎస్ ఈ విజయ్ కుమారి, ఈ ఈలు శ్రీనివాసరావు, రమణరావు, డ్రైనేజీ ఈ ఈ విజయలక్ష్మి, సిపిఓ గణేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

క్రీడాభివృద్ధికి స్పోర్ట్స్ కేలండర్

స్పోర్ట్స్ కేలండర్ రూపొందించి అమలు చేయడం ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించి, క్రీడాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడల అభివద్ధికి తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానికంగా స్టేడియం నిర్మాణ పనులు వేగవంతం చేసి, క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్టేడియం వద్ద షాపులు నిర్మించి జిల్లా క్రీడాధికార సంస్థకు ఆదాయ వనరులు లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. క్రీడ క్యాలెండర్ రూపొందించి అమలు చేయాలన్నారు.డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీని ఆర్థికంగా పటిష్టం చేసేందుకు పంచాయతీల ద్వారా పన్నుల వసూళ్లలో మూడు శాతం స్పోర్ట్స్ సెస్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఖాతాకు జమ చేసేలా వెంటనే చర్యలు తీసుకోవాలని డిపిఓ ను కలెక్టర్ ఆదేశించారు. కమిటీ వైస్ చైర్మన్, జిల్లా ఎస్పి ఆర్. గంగాధర్ రావు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు శాఖ పరంగా తమ వంతు సహకారం అందిస్తామని, క్రీడారంగంలో కష్ణాజిల్లా అగ్రగామిగా నిలబెట్టేందుకు కషి చేస్తామన్నారు.తొలుత సమావేశంలో కమిటీ సభ్య- కన్వీనర్, జిల్లా క్రీడల అభివద్ధి అధికారి కే. ఝాన్సీ లక్ష్మి అజెండా అంశాలు వివరించారు. ఇండోర్ స్టేడియం వద్ద ప్రహరీ నిర్మాంచవలసిన అవసరం ఉందని కమిటీ దష్టికి తీసుకొచ్చారు.కమిటీ సభ్యులు డిఎం అండ్ హెచ్ వో డాక్టర్ జి గీతా బాయి, డిపిఓ ఎస్ వి నాగేశ్వర నాయక్ , జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎస్. కిషోర్ కుమార్, ఎన్. గాయత్రి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కె.వెంకట్రావు పాల్గొన్నారు.

మహిళపై లైంగిక దాడి

ప్రజాశక్తి-పెడన: మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని ఎస్వి పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తోకల వినోద్ కుమార్, దోమతోటి లక్ష్మణరావు ఈ నెల మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఆమెను బంధించి అత్యాచారం చేశారు. దోమతోటి లక్ష్మణరావును పోలీసుల అదుపులోకి తీసుకోగా, వినయ్కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి వినయ్కుమార్ విజయవాడ ఓ లాడ్జిలో దొరికినట్లు సమాచారం. గురువారం నిందితుల ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎఎస్ఐ సురేష్కుమార్ తెలిపారు.

200 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం మండలం పొలాటిటిప్ప గ్రామంలో ఎస్ఈబి ఇన్స్పెక్టర్ జి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ మోకా రాజు ఆధ్వరంలో బుధవారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 200 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. కొక్కిలిగడ్డ బసవయ్య, మోకా వెంకటేశ్వరమ్మ, మోకా వెంకటేశ్వరమ్మ సున్నపూడి భారతిలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.



వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి: స్థానిక పడమర వీధికి చెందిన పఠాన్ బాబులు గత కొంతకాలంగా మధుమేహం, కిడ్నీ సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొంటూ తీవ్రంగా బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న అవనిగడ్డ కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ బుధవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని వైద్య ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బాధితుని గహం వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, పున్నయ్య చౌదరి, పులుగడ్డ చంద్ర, బర్మా శ్రీను, రేపల్లె ముసలయ్య, బర్మా బుజ్జి, ప్రకాష్, బొప్పన వెంకట రమణ పాల్గొన్నారు.



చిన్న తరహా పరిశ్రమలకు రాయితీలు : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడివాడ: గత వైకాపా ప్రభుత్వంలో అన్ని రంగాలతో పాటుగా చిన్న తరహా పరిశ్రమలు కూడా తీవ్రంగా నష్టపోయాయని, తీసివేసిన రాయితీలను తిరిగి ప్రవేశపెడతమని ఎమ్మెల్యే రాము అన్నారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాయలంలోని ప్రజా వేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు ది కష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటో మొబైల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు, కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని గుర్తింపు పొందిన గుడివాడ ఆటోనగర్ అభివద్ధికి గత పాలకులు కనీస చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. నిత్యం వేలాది మందికి ఉపాధి కల్పించే ఆటోనగర్ ద్వారా మరింతమందికి ఉపాధిని అందించేలా ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అభివద్ధి చేస్తామన్నారు. చిన్న తరహా పరిశ్రమను ప్రోత్సహించేలా గతంలో ఉన్న రాయితీలను వైకాపా ప్రభుత్వం తీసివేసిందని, చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక రంగ అభివద్ధిలో భాగంగా రాయితీలను తిరిగి ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు లక్ష్మణరావు, యూనియన్ నాయకులు హమీద్, నాగరాజు, భాషా, వివిధ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.





విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

భారత యువజన సంఘం ఆధ్వర్యంలో పెనమకూరు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్సిల్, విద్యార్థులకు అవసరమైన ఇతర మెటీరియల్ను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు, ఎంపిటీసి మరీదు మధుబాబు, కో ఆపరేటీవ్ బ్యాంక్ అధ్యక్షులు బొలెం శ్రీనివాస్, ఉపాధ్యాయలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అవనిగడ్డలో భారీ వర్షం

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలో మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న నేపథ్యంలో నారుమల్లు పోసుకున్న రైతులకు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తుందని తెలుపుతున్నారు. ఒకవైపు కాలువ నీళ్లు మరోవైపు వర్షం కూడా తోడవడంతో ఖరీఫ్ సజావుగా సాగే అవకాశం కనబడుతుందని రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. పాత ఎడ్ల లంక గ్రామం చుట్టూ వరద నీరు చేరే అవకాశం ఉన్నందున ఆయా గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారు.

పంటల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-గూడూరు: రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఎన్ పద్మావతి తెలిపారు. బుధవారం ఈ పంట పక్రియ ను పరిశీలించే నిమిత్తం గూడూరు మండలం వచ్చిన ఆమె రైతులతో మాట్లాడుతూ జిల్లా లోని ప్రతి ఒక్క రైతు తమ పంటను ఈ పంట లో నమోదు చేయించుకుని ధాన్యం సేకరణ లో, అకాల వర్షాలకు, తుపాన్ లకు పంట నష్టపోయినప్పుడు ఇన్సూరెన్స్ పొందుటకు అవకాశం వుందని తెలియచేసారు. మండల వ్యవసాయ అధికారి జి శివప్రసాద్ మాట్లాడుతూ రెవిన్యూ వారు జారీ చేసిన కౌలు రైతు కార్డు పొందిన ప్రతి రైతు కూడా ఈ పంట లో తమ పంటను నమోదు చేసుకోవాలని తెలిపారు.



రెస్టారెంట్లలో తనిఖీలు

ప్రజాశక్తి-గుడివాడ

బుధవారం పట్టణంలోని పలు హోటళ్లల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కష్ణాజిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ షేక్ గౌస్ మొహినుద్దీన్ విలేకర్లులతో మాట్లాడుతూ పలు హోటల్స్ నిబంధనలు పాటించకపోవడం, అపరిశుభ్ర వాతావరణం ఉందన్నారు. ఏలూరు రోడ్డులోని ఫ్రైడ్ వింగ్స్ ఫుడ్ కోర్టులో కాల పరిమితి తీరిన ముడి పదార్థాలు, బ్రెడ్లు, హానికర కలర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిబంధలను పాటించక పోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని హోటళ్లపై సెక్షన్ 61 ప్రకారం జరిమానాలు విధిస్తామన్నారు.

చేనేత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ జగన్ మోహన్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవ జయరాజు మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రోత్సహించాలని చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ ఆర్.హిమాలనీ దేవి, అధ్యాపకులు డాక్టర్ ఎస్ సత్య రాజేష్, జహీదా బేగం, చలం పాల్గొన్నారు.





మచిలీపట్నంరూరల్: జాతీయ చేనేత దినోత్సవాన్ని మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ బాల సరస్వతి వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్ పర్సన్ విట్టంశెట్టి వెంకు మాస్టారు ఆధ్వర్యంలో చేనేత పెద్దలందరికీ దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మురుగుడు వెంకట నాగేశ్వరరావు, పెద్దలు భట్టు వెంకట రంగారావు, గొర్రె సుబ్బారావు, విట్టటంశెట్టి వెంకట నాంచారయ్య పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ: మోపిదేవిలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం కేశఖండనశాల నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌ను ఆయన స్వగృహం వద్ద బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు ఆర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎం బాల భాస్కరరావు, ఎం.నాంచారయ్య పాల్గొన్నారు.



ఎం.జి.మోటార్స్ ఛార్జింగ్ ఫ్లాట్‌ఫాం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎం.జి.మోటార్స్ ఆధ్వర్యంలో ఇ.వి. భారత్ పేరుతో ఎలక్ట్రిక్ కారును విడుదల చేసినట్లు జెఎస్ డబ్ల్యూ ఎం.జి.మోటార్స్ చీఫ్ ఆఫీసర్ గౌరవ్ గుప్తా తెలిపారు. నగరంలోని ఎం.జి.మోటార్స్ షోరూమ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ కార్ల వినియోగం పెరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎం.జి.మోటార్స్ ఎలక్ట్రిక్ కారును రూపొందించినట్లు తెలిపారు. ఎలక్ట్రిక్ కార్ల యూజర్ల కోసం ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం, ఇంటరాక్టివ్ గేమింగ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. కస్టమర్ల కోసం ఈవీ ఛార్జింగ్ సదుపాయం ఏవిధంగా ఉంటుందో అనే దానిపై కూడా కూలంకుషంగా తెలియచేసినట్లు తెలిపారు. తమ సంస్థ ఈవీ టెక్నాలజీని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అత్యాధునిక మార్పులు చేసి కొత్త తరహాలో కార్లను అందిస్తున్నామని తెలిపారు.

పిల్లల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పిల్లలు సహజంగానే ఆసక్తిని కలిగిఉంటారని, తల్లిదండ్రులు పిల్లల ఇష్టా ఇష్టాలను గమనిస్తూ వారి ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావాలని అమెజాన్‌అలెక్సా ప్రతినిధి కె.ఈశ్వరన్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఇటీవల అమెజాన్ అలెక్సా నిర్వహించిన అధ్యయనంలో పిల్లలు, వారి తల్లిదండ్రుల ప్రవర్తనపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ మంది పిల్లలు వారి ఊహలకు అందని విధంగా ఆలోచనలు ఉంటున్నాయని, పిల్లలకు వచ్చే ప్రశ్నలకు సమాధానాలను అందించడం తల్లిదండ్రుల వల్ల కావడం లేదని తమ అధ్యయనంలో వెల్లడైందని అన్నారు. తమ సంస్థ ప్రతి ఏటా పిల్లలపై వారి ఇష్టా ఇష్టాలు, వారి ఆలోచనలపై వివిధ రకాలైన అధ్యయనాలను నిర్వహిస్తుందని, వాటిని తల్లిదండ్రులకు ఎప్పటికపుడు తెలియచేస్తున్నామన్నారు.



ఎన్‌టిటిపిఎస్ బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహింపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంట్రాక్ట్ కార్మికుడు వి.అప్పారావును, ఎన్‌టిటిపిఎస్ ఉద్యోగి చక్రధర్‌ని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు బుధవారం పరామర్శిం చారు. ఈ సందర్భంగా వారిద్దరి ఆరోగ్య పరిస్థితిపై ఎంఎల్ఎ కృష్ణప్రసాద్ ఆరా తీశారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులను కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపడతామన్నారు.

15న 'జయహో భారత్' ఆర్ట్ కాంటెస్ట్

ప్రజాశక్తి - విజయవాడ : ఆగష్టు15న చిన్నారులకు "జయహో భారత్.." ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహించనున్నట్లు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ప్రధాన కార్యదర్శి స్ఫూర్తి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ గవర్నరుపేట రాఘవయ్యపార్క్ సమీపంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) నాలుగో అంతస్తులో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన రీ క్రియేట్ త్రీడీ లైఫ్ కాస్టింగ్ సమర్పణలో 1వ తరగతి నుండి పీజీ విద్యార్థుల వరకు మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రవేశం ఉచితమని, సబ్ జూనియర్స్ (1,2,3 తరగతులు)కు "నాకు నచ్చిన ప్రదేశం @ భారత్", జూనియర్స్ (4, 5, 6 తరగతులు)కు "నేను మెచ్చిన మన సంస్కృతి", సీనియర్స్ (7, 8, 9, 10 తరగతులు)కు "భారత దేశం నా స్వర్గసీమ" అంశాలపై ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహిస్తామన్నారు. సూపర్ సీనియర్స్ (ఇంటర్, డిగ్రీ, పీజీ) పురోగమన వైతాళికుల పోర్ట్రేట్ చిత్రాలను చిత్రీకరించాల్సి ఉంటుంది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవం జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు ఈనెల 14వ తేదీ సాయంత్రం 8 గంటలలోపు తమ పేర్లను వాట్సాప్ నెంబరు 93479 50085 లేదా ఈమెయిల్ forumforartistsvja@gmail.com ద్వారాగానీ నమోదు చేసుకోవాలని కోరారు.

మూగజీవాలకు మేత కరువు

ప్రజాశక్తి - వీరులపాడు : నెల రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు జీవాలు రోగులు బారిన పడుతున్నాయి. అధిక వర్షాల కారణంగా జీవాలకు సరైన వసతి కల్పించకపోవడంతో మృత్యువాత పడుతున్నాయి. జీవాలకు కావలసిన పచ్చిక బయళ్లు లేకపోవడం దాణా సౌకర్యం కల్పించకపోవడం జీవాలకు సరైన ఆహారం పెట్టకపోవడం వల్ల రోగాలు పాలవుతున్నాయి. దీంతో గొర్రెల కాపరులు భారీగా నష్టపోతున్నారు. గొర్రెలు మేకల పెంపకదారుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తు పోరాటాలు నిర్వహించి గొర్రెల మేకల పెంపకందార్ల కార్పొరేషన్ ఏర్పాటు చేసుకున్నారు. కార్పొరేషన్‌లో రాజకీయ నాయకులు తిష్ట వేయడం వల్ల గొర్రెల కాపరులకు అందవలసిన సబ్సిడీలు పక్కదారి పడుతున్నాయి. గొర్రెల కాపరులకు రాయితీ రుణాలు



అందించి మేత సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని మేకల పంపకదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వర్షాకాలంలో గొర్రెలకు గాలి కుంటి వ్యాధితో తెల్లసొంగ పలు వ్యాధులతో పెద్ద మొత్తంలో మృత్యువాత పడుతున్నాయని అధికారులు ఆదుకోవాలని కోరుతున్నారు.

తల్లిపాలు దానం చేసిన తల్లులకు సన్మానం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : తల్లిపాలను దానం చేసిన మాతృమూర్తులను స్థానిక రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో బుధవారం ఘనంగా సన్మానించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ రాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దానం చేసిన తల్లిపాలు ఎంతోమంది శిశువుల ప్రాణాలను కాపాడుతున్నాయన్నారు. దానం చేసిన తల్లిపాలను భద్రపరచడానికి త్వరలో విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో మదర్ మిల్క్ బ్యాంకును కూడా ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. మహోన్నత కార్యక్రమంలో భాగంగా ఇతర తల్లులకు ఆదర్శంగా నిలిచేందుకు డాక్టర్ సౌమ్య, డాక్టర్ శ్రీలత అనే ఇద్దరు వైద్యులు కూడా తల్లిపాలను దానం చేశారని ఆయన తెలిపారు. డాక్టర్ వంశీ శివరామరాజు మాట్లాడుతూ ఏ బిడ్డకైనా తల్లిపాలు ఇవ్వడం ఉత్తమమైన ప్రారంభమని, నవజాత శిశువులందరికి తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని అన్నారు. తల్లిపాలకు సంబంధించి అవగాహన కలిగించేందుకు తల్లుల నుంచి పాలను సేకరించేందుకు తమ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఒక హెల్ప్‌లైన్ ప్రారంభించామని 970 377 1222 నెంబర్కు ఫోన్ చేయడం ద్వారా సమాచారం తెలుసుకోవచ్చని




తల్లులను సన్మానించిన డాక్టర్ రాంప్రసాద్, తదితరులు

ఆయన%యి% చెప్పారు. డాక్టర్ పి బ్రాజిష్ణ మాట్లాడుతూ తల్లిపాలు తాగే శిశువులకు జీర్ణ, చెవి ఇన్‌ఫెక్షన్లు తక్కువగా ఉంటాయని పరిశోధనలో వెల్లడైందన్నారు. డాక్టర్ స్నేహలత మాట్లాడుతూ తల్లిపాలను శిశువుకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు ఇవ్వవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా తల్లిపాలు దానం చేసిన డాక్టర్ సౌమ్య ,డాక్టర్ శ్రీలత, హరిత, రచన, శ్వేత, అన్నపూర్ణ, మౌనిక, ఉమాదేవిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంప్రసాద్ డాక్టర్ బి.ఎస్‌సిపి.రాజు, డాక్టర్ వంశీ శివరామరాజు, డాక్టర్ పి.బ్రాజిష్ణ, డాక్టర్ ఉమా మిక్కిలినేని, డాక్టర్ స్నేహ మద్దుకూరి, డాక్టర్ ఎం.విజయ, హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర్ పాల్గొన్నారు.

వణికిస్తున్న వర్షాలు - విజృంభిస్తున్న దోమలు

ప్రజాశక్తి - వీరులపాడు : పలు గ్రామాల్లో కొద్ది రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో పెద్ద ఎత్తున దోమలు విజృంభిస్తున్నాయి. వర్షాలతో పారిశుద్ధతో అస్త వ్యవస్థగా తయారైంది. రోడ్డుకిరువైపులా పెద్ద ఎత్తున చెత్త పేరుకొని దుర్వాసన, మరోవైపు డ్రైనేజీ మురుగు నిలిచిపోయి నివాసితులకు ఎటు చూసినా ఇక్కట్లే. అధికారులు పట్టించుకోవటం లేదని ఆయా గ్రామ ప్రజల నుండి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలో ఉన్న గ్రామంలో కనీసం దోమల నివారణ మందు ఏర్పాటు చేయటం లేదని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా దళితులు నివాస ప్రాంతాల్లో ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల దోమలతో రోగాల పాలవుతున్నారని వాపోతున్నారు. గ్రామాల్లో చెత్త మురుగు శుభ్రం చేసే పరిస్థితి కనిపించటం లేదు. గ్రామ పంచాయతీలకు నిధులు లేకపోవడమే కారణమంటున్నారు. గత సంవత్సరం నుండి ప్రభుత్వం నుండి బిల్లులు నిలిపివేయడంతో నిధుల కొరత ఏర్పడిందని అధికారులు చెప్తున్నారు. మండలంలో 22 పంచాయతీల పరిస్థితి ఇలాగే ఉంది. నిధుల కొరతతో దోమల



నిర్మూలన చర్యలు అధికారులు ముందుకు రావడం లేదు. మురుగు గోతుల్లో బ్లీచింగ్ చల్లిస్తే దోమలు ఉత్పత్తి ఉండదని అంటున్నారు. రెండు రోజులకు ఒకసారి అయినా చెత్తని తీసుకెళ్లట్లేదని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు రంగంలో దిగి గ్రామాల్లో పారిశుధ్య పనులు చర్యలు చేపట్టాలని దోమల నియంత్రణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కెఎల్ రావు పార్కులో ఇండోర్ స్టేడియం ప్రారంభం

ప్రజాశక్తి, వన్‌టౌన్ : క్రీడలు క్రీడాకారులను ప్రోత్సహిస్తామని పశ్చిమలోని క్రీడాకారులకు సంబంధించి ఏ సమస్య తన దష్టికి తీసుకొచ్చినా పరిష్కరిస్తానని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) తెలిపారు. బుధవారం 46వ డివిజన్ కె.ఎల్. రావు పార్కులోని ఇండోర్ స్టేడియాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ నియోజవర్గంలోని స్టేడియాలు, క్రీడా ప్రాంగణాలు, అభివద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. షటిల్, బ్యాడ్మింటన్, క్రీడలకు సౌకర్యవంతంగా ఉండేలా ఇండోర్ స్టేడియం నిర్మించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని క్రీడా ప్రాంగణాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుల్ మీరా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, టిడిపి



ఇండోర్ స్టేడియం ప్రారంభించి షటిల్ ఆడుతున్న ఎంఎల్ఎ సుజనా, నాగుల్ మీరా

కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, టిడిపి మాజీ ఉపాధ్యక్షులు గుర్రం కొండ, డివిజన్ ప్రెసిడెంట్ డిటి ప్రభుదాస్, బిజెపి నాయకులు శివకుమార్ పట్నాయక్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగులకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ చెందిన 24 వార్డు కౌన్సిలర్ పులి అరుణకుమారి, పులి దాసుల కుమార్తెలు రాజీవని రసజ్ఞ, మృదుల సంజన జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీం పట్నంలోని గాజులపేట సహాయ మాత పాఠశాలలలో వికలాంగులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ముందుగా కేకులను కట్ చేశారు. వారికి వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కష్ణప్రసాదు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్డీఏ మహా కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారు తాపడం పనులకు విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి డోనార్ సెల్‌లో గాంధీ బొమ్మ సెంటర్, కె.టి.రోడ్, లంబాడిపేట, విజయవాడకు చెందిన బండి లక్ష్మణరావు, కుటుంబసభ్యులు రూ.3,01,116 లను శ్రీ అమ్మవారి ఆలయం స్వర్ణ తాపడం పనుల నిమిత్తం బుధవారం ఆలయ అధికారులను కలిసి విరాళం అందజేశారు. ఆలయ అధికారులు వీరికి కనక దుర్గమ్మ అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించగా ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం మరియు చిత్రపటం అందజేశారు.



నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న బేగ్

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక కొత్తపేట 51వ డివిజన్ నెహ్రూ బొమ్మ కూడలిలో ఉన్న డివైడర్ ట్రాఫిక్‌కి తీవ్ర ఇబ్బందికరంగా మారిందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్ దృష్టికి తీసుకొని రాగా స్థానిక కూటమి నాయకులతో కలిసి ఆ ప్రాంతాన్ని బేగ్ పరిశీలించారు. అనంతరం బేగ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలోని ముఖ్య కూడళ్లలో నెహ్రు బొమ్మ కూడలి కూడా ఉందని, ఇక్కడ ఎక్కు వగా శ్రామిక కార్మిక వర్గం, వ్యాపారం, విద్య సముదాయాలకు ప్రధాన కూడలిగా ఉందని అన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

శ్వాస కోశ సమస్యపై అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : శ్వాసకోశ ఆరోగ్యానికి వర్షాకాలం ముఖ్యమైన సవాళ్లను కలిగిస్తుందని, పెరిగిన ఆర్ద్రత, తేమ ఊపిరితిత్తుల పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తాయని. ఈ సమయంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చాలా కీలకం అని ప్రముఖ వైద్యులు డాక్టర్ కార్తీక్ అన్నారు. నగరంలో సిప్లా అధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లడుతూ ప్రోయాక్టివ్ పేషెంట్ కేర్‌కు నిరంతర నిబద్ధతకు అనుగుణంగా, సిప్లా యొక్క సమగ్ర పేషెంట్ సపోర్ట్ ఇనిషియేటివ్ బ్రీత్‌ఫ్రీ మాన్‌సూన్ యాత్రను ప్రారంభించిందన్నారు. ఆస్తమా, సిఓపిడి (క్రోనిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) వంటి దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్‌లకు యాత్ర అధిక ప్రాప్తిని అందిస్తుందని తెలిపారు. బ్రీత్‌ఫ్రీ మాన్‌సూన్ యాత్ర ద్వారా వ్యక్తులు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడానికి అవసరమైన సమాచారం, వనరులకు ప్రాప్యతను కలిగి ఉండేలా నిర్ధారిస్తుందని కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్, స్లీప్‌మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ కార్తీక్ తిప్పారపు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

శివారు గ్రామాలకు అందని సాగునీరు



- నేటికీ మరమ్మతులకు నోచని పంట కాలువలు
- ఒక్కో ఎకరానికి రూ.6 వేల ఖర్చు అదనం

ప్రజాశక్తి-పెడన: అధికారుల నిర్లక్ష్యమో....పాలకుల అలసత్వమో... ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభ దశలోనే అగమ్యగోచరంగా మారింది. మరోవైపు సకాలంలో వర్షాలు పడక ఇటు కాలువల ద్వారా సాగునీరు అందకపోవడంతో రైతు దిగాలు చెందుతున్నారు. దేశానికి వెన్నెముకైనా రైతుకే ఇప్పుడు డీజిల్ ఇంజన్ల రూపంలో నడ్డి విరుగుతోంది. ఇదిలాగే కొనసాగితే మున్ముందు ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆందోళనకు లోనవుతున్నారు. మండల పరిధిలోని 9164 హెక్టార్ల భూమి ఉంది. వీటిలో 110 హెక్టార్లలో ఆకుకూరలు, కూరగాయలు, నర్సరీ వంటివి సాగుతున్నాయి. అంతేకాకుండా 954 హెక్టార్లలో ఎద పద్ధతి ద్వారా, అలాగే 6 వేల హెక్టార్లలో నాట్లు వేసి వ్యవసాయాన్ని రైతులు సాగు చేస్తున్నారు. అయితే నారుమడులు వేసి దాదాపు 40 నుంచి 45 రోజులు అవుతుంది మండల పరిధిలోని కవతరం కెనాల్, అలాగే గూడూరు మండలం రామరాజు పాలెం ఛానల్ నుంచి ఆ భూములకు సాగునీరు సరఫరా అవుతుంది. అయితే ప్రస్తుతం వస్తున్న అరకొర సాగునీరు ఎగువ ప్రాంతాల్లో రైతులు డీజిల్ ఇంజన్లు, ట్రాక్టర్లు, విద్యుత్ మోటార్ల సహాయంతో తోడి వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారు. దీనివలన దిగువ ప్రాంతాలైన పుల్లపాడు, నేలకొండపల్లి, దేవరపల్లి, జింజేరు, అచ్చయ్యవారిపాలెం గ్రామాలకు నేటికీ కాలువల ద్వారా సాగునీరు సరఫరా కాలేదు. వర్షాలు కూడా అడపా దడపా పడటంతో సాగునీరు లేక ఆయా గ్రామాల్లోని పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అసలే అంతంత మాత్రమే నెట్టుకొస్తున్న ఈ వ్యవసాయానికి ఇప్పటికే ఒక్కో ఎకరానికి రూ.6 వేలకు పైగా అదనంగా నీటికి తోడుకునేందుకు భారం అవుతుందని వాపోతున్నారు.

ఇప్పటికే ఇది నాలుగో సారి

చిల్లిముంత నాగరాజు, నేలకొండపల్లి



ఎదవేసినప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగోసారి నీళ్లు తోడుతున్నాం. కాలువలకు పక్కనే ఉన్న పంట పొలాలకు ఒక్క ఎకరానికి ఒక్కసారి నీరు తడిపితే 1500 నుంచి 1600 ఖర్చు అవుతుంది. అదికూడా అరకొరగానే ఇంజన్లకు అందుతున్నాయి. దూర ప్రాంతాల భూములకైతే చెప్పనవసరం లేదు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

నెల రోజులైనా నీరు రాలేదు

పడమట నాగ సుబ్రహ్మణ్యం, పుల్లపాడు



కాలువల ద్వారా నీటిని విడుదల చేసి నెల రోజులు అవుతుంది. అయినా నేటికీ మా ఊరికి ఇంకా నీరు చేరలేదు వర్షాల పైనే ఆధారపడ్డాం. అవి కూడా అంతంత మాత్రమే పడటంతో పంట పొలాలు అప్పుడే ఎండిపోతున్నాయి. కనీసం వంటకాలువలోని తూడు, గుర్రపుడెక్క తొలగించలేదు. రైతులే స్వచ్ఛందంగా బాగు చేసుకుంటున్నారు.

ఎల్ఐసి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : దేశంలో ఉన్న 113 ఎల్ఐసి డివిజన్‌లలో మచిలీపట్నం డివిజన్ అగ్రస్థానంలో ఉందని ఎల్ఐసి మచిలీపట్నం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ డా.సుధాకర్‌బాబు తెలిపారు. చల్లపల్లిలోని పోలీస్‌స్టేషన్ బజార్లో నూతనంగా ప్రారంభించిన ఎల్ఐసి అసోసియేట్ (లికా) కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థ నూతనంగా యువ టర్మ్, యువ క్రెడిట్ లైఫ్ పేరుతో రెండు నూతన ప్లాన్ లను ఆవిష్కరించిందని తెలిపారు. 18 నుంచి 45 వయసున్న వారికి ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి అవనిగడ్డ బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్, ఏబీఎం రామయ్య, ఎస్‌జిఎ బాష పాల్గొన్నారు.



అమ్మ ఫుడ్ ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం : ఎస్ఐ

ప్రజాశక్తి-పెడన: పేదలకు పట్టెడు అన్నం పెట్టాలన్న ఆశయంతో ముందుకు సాగడం హర్షనీయమని ఎస్సై సూర్య శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక రామలక్ష్మి కాలనీలోని అమ్మ ఫుడ్ ఫౌండేషన్ నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్య శ్రీనివాసరావు మాట్లాడుతూ వికలాంగులైన యర్రా మల్లికార్జునరావు, చౌడేశ్వరి దంపతులు నిత్యం పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అంగవైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా ఇలాంటి సేవ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. గత ఏడేళ్లుగా వికలాంగులైన వీరు ఈ ఫౌండేషన్ ద్వారా వేలాది మందికి అన్నదానం చేయడం ఎంతో స్ఫూర్తిదాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు పాల్గొన్నారు.




టిడిపిలోకి ఇద్దరు కౌన్సిలర్లు

ప్రజాశక్తి-పెడన: పట్టణ పరిధిలోని ఒకటవ వార్డు బల్ల పద్మావతి, 20వ వార్డు కొసనం కరుణ కుమారి ఎమ్మెల్యే కెకె ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం టిడిపిలో చేరారు. కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరినట్లుకౌన్సిలర్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు పట్టణంలో ఉన్న 24 వార్డుల్లో కేవలం ఒక వార్డు మాత్రమే టిడిపి చెందిన కౌన్సిలర్ ఉండడంతో ప్రస్తుతం మరో ఇద్దరు టిడిపికి సానుకూలంగా పనిచేయనున్నారు.

రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ మండలం ఆవురిపూడి గ్రామ అడ్డ రోడ్డు నుండి కోసూరు వరకు వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డు గుంతలతో శిథిలమై వాహనదారులకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో బుధవారం రోడ్డుపై నిలిచిన వర్షం నీటిలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ రోడ్డు నిర్మించి పది సంవత్సరాలైంది. వర్షాలు కురిసినప్పుడు గుంతలలో నీరు నిల్వ ఉండటం వలన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అవురిపూడి పాలంకిపాడు గ్రామాల మధ్య రెండు కిలోమీటర్లు పూర్తిగా శిథిలమైంది. ప్రతిరోజు విజయవాడ నుండి కాజ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నారు. పాలంకిపాడు నుండి నిమ్మకూరు హై స్కూల్ కు విద్యార్థులు సైకిళ్లపై ప్రతిరోజు వెళుతున్నారు. వ్యవసాయదారులు, ఇతర వాహనదారులు గుంతల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు శీలం నారాయణరావు, మాగంటి రామకృష్ణ, నాగరాజు, కేలం రాంబాబు, ఈడే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





బస్టాండ్ ఆవరణ శుభ్రం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక బస్టాండ్ వద్ద ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 5వ తేదీ ప్రచురించిన వార్తకు పంచాయతీ కార్యదర్శి ఏజెయల్ నరసింహారావు స్పందించారు. బస్టాండ్ ఆవరణను బుధవారం పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. అడ్డుగా ఉన్న బ్యానర్లను తొలగించారు. బ్లీచింగ్ చల్లించారు.



నితాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానం పథకానికి కానూరు గ్రామానికి చెందిన పరుచూరి ఎస్‌విఎల్ సాయికుమార్, ప్రియాంక దంపతులు రూ.50,555 విరాళంగా అందజేశారు. బుధవారం ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణకి అందించగా దాతలను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

ఎఒగా ఇమ్రాన్ బాధ్యతలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు స్థానిక మండల ప్రజా పరిషత్ ఎఒగా ఎండి ఇమ్రాన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏ కొండూరు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తుండగా ప్రమోషన్‌లో భాగంగా గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయం ఎఒగా విధులు చేపట్టారు. ఆయనకు ఎంపీడీవో డి కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు ఏజేయల్ నరసింహారావు, సిహెచ్ ఉమామహేశ్వరరావు, ఎస్ రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

డిజిటల్ మార్కెటింగ్‌తో అధిక ఆదాయం : కలెక్టర్

ప్రజాశక్తి-పెడన: ఈ కామర్స్ మార్కెటింగ్ తో చేనేత వస్త్రాలను విక్రయించడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని, అందుకు తగిన రీతిలో ఆయా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవమును పురస్కరించుకొని జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో పెడన పట్టణంలోని పోలవరపుపేట, శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవాంగ ప్రార్థన మందిరంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.కె బాలాజీ మాట్లాడుతూ ఒకప్పుడు వస్త్ర పరిశ్రమలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. అయితే నాటి బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశం నుంచి పత్తి, ఇతర ముడి సరుకులను ఇంగ్లాండ్ కు తరలించి, అక్కడ తయారైన వస్త్రాలను ఇక్కడకు దిగుమతి చేసుకొని మనకు అమ్మేవారని, మహాత్మా గాంధీ దీనిని వ్యతిరేకించి స్వదేశీ ఉద్యమంతో స్వదేశీ వస్త్రాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చేనేత కార్మికులు నాణ్యమైన వస్త్రాలను తయారు చేస్తున్నప్పటికీ వాటిని మార్కెట్లో అమ్ముకోవడం కీలక అంశంగా మారిందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారం చేసుకోకుండానే అమెజాన్,



ఫ్లిప్కార్ట్, మింత్ర వంటి వెబ్ సైట్ల ఈ కామర్స్ మార్కెటింగ్ తరహాలో ఇక్కడ తయారు చేసిన వస్త్రాలను ఆన్లైన్ ఆర్డర్ ద్వారా ఇతర దేశాలకు అమ్మకాలు చేసే విధంగా వినూత్నంగా ఆలోచించాలని సూచించారు. ఈ క్రమంలో సమాజ అభిరుచికి తగ్గట్టుగా నూతన డిజైన్లతో వస్త్రాలను తయారు చేసే విధంగా చేనేత కార్మికులకు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, బందరు ఆర్డీవో ఎం వాణి, రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, విఘ్నేశ్వర సొసైటీ మాజీ అధ్యక్షుడు యడ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి-చల్లపల్లి: పిల్లలకు తల్లిపాలు వ్యాధినిరోధక శక్తిగా పని చేస్తాయని ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్.ఆదిలక్ష్మి సూచించారు. చల్లపల్లి నారాయణనగర్‌లోని మోడల్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సూపర్వైజర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లులకు, గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ ముంతాజ్, విజయలక్ష్మి, ఎఎన్ఎం నాగలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ ఎస్.నాగలక్ష్మి పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం ఐసిడిఎస్ గుడివాడ ప్రాజెక్ట్, డోకిపర్రు సెక్టర్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రం వద్ద గర్భవతులకు, తల్లులకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఐసిడిఎస్ సిడిపిఓ విజయ ఫ్లోరెన్స్, గ్రామ సర్పంచ్ జి జ్యోతి,


పెదపారుపూడిలో...



చల్లపల్లిలో...

సూపర్వైజర్ వాణి, ఏఎన్ఎం ఉషారాణి పాల్గొన్నారు. **పమిడిముక్కల:** తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని, వ్యాధి నిరోధక శక్తి కలిగి ఉంటుందని అంగన్వాడి సూపర్వైజర్ మన్నే ఝాన్సీ రాణి అన్నారు. కృష్ణాపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రం వద్ద నిర్వహించిన తల్లిపాల వారోత్సవంలో ఎఎన్ఎం ఎం.సుమలత, మనీషా పాల్గొన్నారు. **మొవ్వ:** మండలంలోని పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పెదపూడి అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ కళ్యాణి గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఎన్ .భవాని, సిహెచ్. గంగాభవాని పాల్గొన్నారు. **పెదపారుపూడి:** ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు ముగిసినట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ మండల సూపర్వైజర్లు ఎం శివ నాగమణి, అరుణకుమారి బుధవారం తెలిపారు. మండలంలోని వెంట్రప్రగడ, గురువిందగుంట గ్రామ అంగనవాడి కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలపై గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుంగ కోటేశ్వరమ్మ, కార్యకర్త అన్నపూర్ణ పాల్గొన్నారు.

కొండపల్లి మున్సిపాలిటీకి పాలకవర్గం ఏదీ ?

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికలు జరిగి 30 నెలలు పైగా అయినా ఇప్పటివరకు పాలకవర్గం లేని అనాథ మున్సిపాలిటీగా కొండపల్లి, ఇబ్రహీంపట్నం పంచాయతీ గ్రామాలు మిగిలాయని ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ అన్నారు. కొండపల్లిలోని తమ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మున్సిపాలిటీ అయినందుకు సంతోష పడాలో లేక పాలకవర్గం లేనందుకు బాధ పడాలో అర్థం కానీ అయోమయ పరిస్థితులలో ఇక్కడి ప్రజలు ఉన్నారని తెలిపారు. ఆనాడు అప్పటి వైసిపి శాసనసభ సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ చొరవతో ఇబ్రహీంపట్నం, కొండపల్లి మేజర్ పంచాయతీలను కలిపి గ్రేడ్ - 3 మునిసిపాలిటీగా ఏర్పాటు చేశారన్నారు. దీని పరిధిలో మొత్తం 29 వార్డులు వుండే విధంగా నిర్ణయించి స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా పురపాలక సంఘం కౌన్సిల్ ఎన్నికలు 2021 నవంబరులో జరిగాయన్నారు. ఆనాడు మొత్తం 29 వార్డులకు జరిగిన ఎన్నికలలో 10వ వార్డు నుంచి గెలిచినా టీడీపీ రేబల్ స్వతంత్ర అభ్యర్థి, గెలిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు 14 వార్డులు తో కలిపి 15 వార్డులతో మెజార్టీతో నిలిచారు. వైసిపి పార్టీ 14 వార్డులు గెలిచి పాలకవర్గ ఎన్నికల్లో ఓడిపోయింది. అనంతరం స్వతంత్ర అభ్యర్థి ఓటు, ఎక్స్ అఫీషియో ఓట్లతో మున్సిపల్ చైర్మన్ గా తేదేపా అభ్యర్థి ఎన్నికయ్యారు. కానీ ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఈ ఎన్నిక చెల్లదు అని న్యాయస్థానాన్ని ఆశ్రయించి ప్రజలు ఇచ్చిన ప్రజా తీర్పు ను గౌరవించ కుండా పాలకవర్గాన్ని ఏర్పాటు కాకుండా చేయడం చాల బాధాకరమని అని అన్నారు. ఇప్పటికైనా దీనిపై పూర్తి అవగాహన కలిగిన స్థానిక శాసన సభ్యులు వసంత వెంకట కష్ణ ప్రసాద్ దష్టిపెట్టి ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పాలకవర్గం ఏర్పాటు అయ్యేందుకు, అలాగే అభివృద్ధిలో వెనుక పడుతున్న మున్సిపాలిటీ పై తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్స్ పార్టీగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాస్, చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, అక్కల నాగేంద్ర ప్రసాద్, రాగాల రాము, చెరుకు ఆనందరావు తదితర నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొర్రా కిరణ్

విఒఎ మృతి



ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలో నందలూరు గ్రామంలో విఒఎ పనిచేస్తున్న ప్రశాంతి అనారోగ్యంతో మృతి చెందింది. గర్భిణీ అయిన ప్రశాంతిని (28) ప్రసవం కోసం విజయవాడ ప్రభుత్వం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి బిపి డౌన్ అవ్వడంతో కడుపులో బిడ్డ మృతిచెందినట్లు తెలిపారు. అనంతరం ప్రశాంతికి వైద్యం అందిస్తుండగా ఆమె మృతిచెందినట్లు వైద్యులు కుటుంబీకులకు తెలిపారు. విషయం తెలుసుకున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రత్న కిషోర్, విఒఎలు షేక్ మున్ని బాలమ్మ, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రశాంతి కుటుంబాన్ని ఆదుకోవాలి సిఐటియు డిమాండ్ : ప్రశాంత్ కుటుంబాన్ని ఆదుకోవాలి. విఒఎ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఉమాదేవి జిల్లా అధ్యక్షురాలు షేక్ చాంద్ బేగం మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ జిల్లాలో విఒఎ పని భారంతో తమ అనారోగ్యానికి గురవుతున్నారని మృతి చెందిన ప్రశాంతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వం ఇచ్చే రాయితీలు అన్ని ప్రశాంతి కుటుంబానికి అందజేయాలని విఒఎ ఉద్యోగం ప్రశాంతి కుటుంబం సభ్యులకివ్వాలని కోరారు. మండల సమైక్య నుండి మట్టి ఖర్చుల కింద ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు.

వేదాద్రి గ్రామం సందర్శన

జగ్గయ్యపేట : మండల ప్రత్యేక అధికారి జి.మహేశ్వరరావు బుధవారం ఉదయం10 గంటలకు మండలంలోని వేదాద్రి గ్రామాన్ని బుధవారం సందర్శించారు. ప్రప్రథమంగా గ్రామంలోని మండల పరిషత్ (ఎం.పి.యు.పి) స్కూల్‌ను సందర్శించి స్కూల్ అటెండన్స్ రిజిస్టర్, అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. తర్వాత అక్కడ విద్యార్థులు అందరూ ప్రతి రోజు స్కూల్ యూనిఫార్మ్‌ను ధరించుకొని హాజరుకావాలని, గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి పిల్లలకు అర్థమయ్యేలా తెలిపారు. మధ్యాహ్న భోజనం (ఎండిఎం) పథకంలో భాగంగా భోజనం పరిశీలించి, రుచి చూశారు. స్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలించి ఆగిపోయిన పనులను రెండు గదుల్లో ఫ్లోరింగ్, డోర్స్ అండ్ విండోస్ ఫిక్సింగ్, పంపులను టిఇఒ ద్వారా రూ.1,25,000 ఇప్పించేందుకు స్కూల్ ప్రధానోపాధ్యాయుల ద్వారా ఒక అర్జీని పంపాలని ఆదేశించారు. కృష్ణా నీటి ప్రవాహం ఉధృతంగా వస్తున్నందున నదీ పరీవాహక ప్రాంతానికి ఎవరు వెళ్ళకుండా ఒక హెచ్చరిక బోర్డు (ఫ్లెక్సీ)ని ఏర్పాటు చేయాలని డి.టి నాగరాజుకు తెలిపారు. ఈ కార్యక్రమములో మండల పరిషత్ అభివద్ధి అధికారి ఎం రమేష్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ ఎన్. నాగరాజు, సిడిపిం భార్గవి, ఉపాధి హామీ పథకం ఏపీఓ సంతోష్, పంచాయతీ కార్యదర్శి ఎ.శేఖర్, గ్రామ సర్పంచ్ గుడారు పేరయ్య, మండల వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాలి

ప్రజాశక్తి విస్సన్నపేట :: రాష్ట్రంలో అమలు పరిచిన విద్యారంగం సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు విశ్వాసం సడిలిపోతుందని ప్రభుత్వ పాఠశాలలో నిర్వీర్యమై పోతున్నాయని పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వం చక్కదిద్దాలని సుదీర్ఘ కాలంగా ఉన్నటువంటి ఉపాధ్యాయులకు సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ విస్సన్నపేట మండలం స్థానిక తాసిల్దార్ కార్యాలయం నందు తాసిల్దార్ కు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి హెచ్ వి సూర్యనారాయణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించడం జరిగింది. ఈ వినతి పత్రం ల్లో జీవో 117 రద్దు చేసి జీవో ఎంఎస్ నం 55, తేదీ 23.4.2021 ప్రకారం టీచర్లను కేటాయించాలని దేనితోపాటు మరో పంతొమ్మిది డిమాండ్లను కలిగిన వినతిపత్రం తాసిల్దార్ కు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ విసన్నపేట అధ్యక్షులు కే చైతన్య జిల్లా కార్యవర్గ సభ్యులు పి రామకష్ణారెడ్డి యుటిఎఫ్ నాయకులు వెంకటేశ్వరరావు రాజశేఖర్ రవి రాంబాబు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



వయనాడ్ బాధితులను ఆదుకుందాం


నందిగామలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు


తిరువూరులో విరాళమిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - నందిగామ : వయనాడ్ విపత్తుబాధితులకు నందిగామలో బుధవారం సిపిఎం పార్టీ నాయకులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం నందిగామ కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో వయనాడ్ వరదలకు కొట్టుకుపోయిన అనేకమంది ప్రజలు మరణించారన్నారు. బాధిత కుటుంబాల్ని ఆదుకోవాలని సిపిఎం విరాళాల సేకరణ పిలుపులో భాగంగా బుధవారం నందిగామ పట్టణంలో డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లో నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలందరూ సహకరించి బాధితులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు ప్రజల్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గోపి నాయక్, ఏవి నారాయణ,షేక్ హుస్సేన్, చనుమోలు మొగిలమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం అంటూ చిన్నారులు

తిరువూరు : కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు చిన్నారులు ముందుకొచ్చారు. వారు కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ.1600 నగదును వరద బాధితులకు విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులకు అందజేశారు. బాధితులకు అండగా తాము సైతం అంటూ ముందు కొచ్చిన ఆ చిన్నారులను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్ అభినందించారు. వయనాడ్ బాధితులకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు తిరువూరు పట్టణంలో సేకరిస్తున్న విరాళాల సేకరణ చేస్తున్నారని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాజుపేటకు చెందిన చోటు కార్ కన్సల్టెన్సీ నిర్వాహకులు షేక్ మహ్మద్ కుమార్తె తొమ్మిదేళ్ల ఆయిషా, కుమారుడు ఆరేళ్ల అయాన్ బుధవారం కిడ్డీ బ్యాంకులో దాచుకున్న సొమ్మును సిపిఎం నాయకులకు ఇవ్వటం ఎంతో చైతన్యంతో కూడుకుందని నాగేంద్ర ప్రసాద్ అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంతంగి శ్రీనివాసరావు, ఆకుల రవి, మోటూ రు చింతయ్య, కోడే రాంబాబు, మంగళగిరి తిరుపతిరావు పాల్గొన్నారు.



వేతనాలు పెంచాలని సమ్మెకు సిద్ధం

విజయవాడ రూరల్ : రామవరప్పాడు గ్రామపంచాయితీలో వివిధ విభాగాల్లో కార్మికులకు వేతనాలు పెంచాలని లేకుంటే 20వ తేదీ నుండి సమ్మెకు సిద్ధమవుతున్నట్లు ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల గౌరవాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరికి పంచాయితీ వారు ఇస్తున్న రోజువారి వేతనం రూ.350లు ఏమాత్రం సరిపోవటం లేదన్నారు. ప్రస్తుతం టెండర్లను రద్దుచేసి, కలెక్టర్ నిర్దేశించిన వేతనాలు ప్రకారం కార్మికులకు వేతనాలు అమలు చేయాలని కోరారు. ఆగస్టు 19వ తేదీ లోపు వేతనాలు పెంచని పక్షంలో ఆగస్టు 20వ తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని ఆగస్టు 4వ తేదీన రామవరప్పాడు యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. వేతనాల పెంపుకు కృషి చేయాలని కోరారు.

వివాదాలను వీడి స్నేహంగా ఉండాలి

ప్రజాశక్తి - వత్సవాయి : గోపినేనిపాలెం గ్రామంలో కొద్దిరోజుల క్రితం జరిగిన వివాదానికి సంబంధించి ఇరువైపులా ఉన్న పెద్దలను బుధవారం వత్సవాయి పోలీస్‌స్టేషన్ వద్దకు ఏసీపీ నందిగామ డాక్టర్ రవి కిరణ్ పిలిపించి వారికి చట్టం గురించి, వివాదాలు గొడవలలో ఉంటే చట్ట ప్రకారం ఎటువంటి ఇబ్బందులు పడే పరిస్థితులు ఉంటాయని అవగాహన కల్పించారు. ఎసిపి నందిగామ డాక్టర్ రవికిరణ్ ఈ నేపథ్యంలో ఇరు వర్గాలకు సఖ్యతగా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో గోపినేనిపాలెం గ్రామ ఇరు వర్గాల పెద్దలు శాంతియుతంగా ఉంటామని తెలిపారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గ్రంథాలయం ప్రారంభం

విజయవాడ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్ జీవిత చరిత్ర నేటి యువతరానికి తెలిసేలా గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర దళిత మార్గం అధ్యక్షులు వేల్పుల రాజేష్ అన్నారు. బుధవారం విజయవాడ అజిత్ సింగ్ నగర్ దళిత మర్గ్ రోడ్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ గ్రంథాలయానికి దళిత మర్గ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల రాజేష్ ఆధ్వర్యంలో ప్రారంభం చేశారు. రాజేష్ మాట్లాడుతూ, అంబేద్కర్ జీవిత చరిత్రను గ్రంథాలయంలో విద్యార్థులు, నేటితరం యువతకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఉద్యమాలు పోరాట స్ఫూర్తిని చిత్రాల రూపంలో ప్రదర్శనశాలగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి చల్లగాల్లి అనిల్, ఏసోబు, జాషువా, మాకం బాబు, ఇల్లూరి ప్రభాకర్ పాల్గొన్నారు.



గ్రంథాలయాన్ని ప్రారంభించిన రాజేష్, తదితరులు



నూతన సిఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒగా సిఐ ఎ.చంద్ర శేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇబ్రహీం పట్నం సిఐగా చంద్ర శేఖర్‌ను నియమిస్తూ విజయవాడ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో పనిచేసిన ఈయన ఇబ్రహీం పట్నం సిఐగా బాధ్యతలు తీసుకున్నారు. ఇబ్రహీంపట్నం సిఐగా పనిచేస్తున్న ముత్యాల సత్యనారాయణ గవర్నర్ పేట సిఐగా బదిలీ అయ్యారు.



చేనేత కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ టిడిపి ఆధ్వర్యంలో బుధవారం చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కార్యాలయంలో జగ్గయ్యపేట పట్టణం చేనేత వార్గాలకు చెందిన గుడిపూడి కృష్ణమూర్తి, గంజి కొండ, బెందడి సోమయ్య, మోరం పుల్లారావు, చిట్టిప్రోలు వీరభద్రం, కొండూరు పెంటయ్య లను మాజీ మున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు సన్మానించారు. ఈ కార్యక్రమానికి పట్టణ టిడిపి అధ్యక్షులు, ఎపి సాధికార డైరక్టర్ మెకా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సంగేపు బుజ్జిబాబు, మాజీ యార్డు డైరెక్టర్ పొట్టబత్తిన గంగాధర్ గారు,18వ వా ర్డు ప్రెసిడెంట్ గోంగూర నాగేశ్వరరావు, గోసిగ శ్రీను, మోతుకూరి మురళీ పాల్గొన్నారు.

శిలాఫలకం తొలగింపు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం కొండూరు గ్రామంలో గత ప్రభుత్వంలో ప్రభుత్వ నిధులతో గ్రామ సచివాలయం నిర్మించి వైసిపి నాయకులు దేవినేని రామారావు, నాగేశ్వరరావు వారి సొంత నిధులతో నిర్మించినట్లుగా భవన నిర్మాణ నిర్వాహకులు అని ఒక శిలాఫలకాన్ని వేసుకున్నారు. అది రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ప్రోటోకాల్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవని జూన్ 20న జిల్లా కలెక్టర్‌కి కొండూరు గ్రామ మాజీ సర్పంచ్ తోట నాగమల్లేశ్వరరావు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం శిలాఫలకాన్ని సచివాలయ అధికారులు తొలగించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

విజయవాడ : ఠాగూర్ లైబ్రరీలో గురువారం ఉదయము 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లైబ్రరీ నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరం విజయవాడలోని ట్రస్ట్ జాయింట్ సెంటర్ వారిచే ఎముకలు, కీళ్ళకు సంబంధించిన పరీక్షలు, (బిఎండి) ఎముకల సాంద్రత తెలిపే పరీక్ష ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మురారి దంత వైద్యశాల వారిచే దంత పరీక్షలు, అనీల్ న్యూరో అండ్ ట్రామా కేర్ వారిచే డయాబేటిక్ న్యూరోపతి, ఇసిజి పరీక్షలు, సంధ్య కంటి ఆసుపత్రి వారిచే ఉచితంగా కంటి పరీక్షలు, యాపిల్ మెడి ల్యాబ్స్ వారిచే షుగర్ పరీక్షలు ఈ వైద్య శిబిరంలో ఉచితంగా అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యాసంస్థల్లో ప్రత్యేక తరగతులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రత్యేక తరగతుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం, ఉపాధ్యక్షులు కీర్తి డిమాండ్ చేశారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న పలు విద్యాసంస్థలను బుధవారం సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడిపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ మచిలీపట్నం నగర వ్యాప్తంగా ప్రైవేటు అండ్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఉదయం 7 నుండి రాత్రి 7:30 గంటల వరకు విద్యార్థుల మీద ఒత్తిడితో కూడిన విద్యను చెప్పడం వారిని మానసికంగా ఇబ్బంది పెట్టడం జరుగుతుందన్నారు. విద్యా సంస్థల్లో ఇప్పటికైనా విద్యాశాఖ మార్పు తీసుకురావాలని ఏదైతే



ఆహ్లాదకరంగా చదవాల్సిన విద్యార్థులు ఒత్తిడితో కూడిన విద్యని అభ్యసించడం ఎంతవరకు సబవాని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గా ప్రశ్నిస్తున్నానన్నారు . విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కి ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్దులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్న కళాశాలపై జిల్లా, డివిజనల్ విద్యాశాఖాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. పైగా కష్ణా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ అండ్ కార్పొరేట్ విద్యా సంస్థలకు వంత పాడటం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెంచుతూ వారి అనారోగ్య నికి కారణం అవుతున్న కళాశాలలు, పాఠశాల ల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కాబట్టి ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చూడాలని అవసరమైతే ఈ విషయాన్ని విద్య శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని ఆప్పటికీ పరిష్కారం కాకపోతే విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఎస్ఎఫ్ఐ నాయకులు జైకర్ ,ప్రదీప్, సాయి, కిరణ్, బాజీ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పోర్టుకు అనుసంధానంగా రోడ్లు నిర్మించండి : ఎంపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం పోర్ట్ పనులు వేగవంతంగా జరుగుతున్న తరుణంలో పోర్ట్ నుంచి రాకపోకలకు వీలుండేలా రహదారుల నిర్మించాలని ఎంపి బాలశౌరి కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు ఎంపి కార్యాలయం తెలిపింది. ఈ మేరకు మూడు ప్రధాన జాతీయ రహదారుల నిర్మాణంపై మూడు లేఖలను మంత్రికి ఎంపి బాలశౌరి అందజేశారన్నారు. ఇప్పటికే పోర్టు పనులు దాదాపు 25 శాతం పూర్తయ్యాయని. మిగిలిన పనులు వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తి చేస్తామని గుత్తేదారు సంస్థ గట్టిగా చెబుతోందని. ఈ నేపథ్యంలో పోర్టు అనుసంధానంగా రెండు జాతీయ రహదారులు, పెడన-గుడివాడ మధ్య జాతీయ రహదారిని నాలుగు లైన్లను విస్తరించాలని ఎంపీ బాలశౌరి కోరినట్లు తెలిపారు. ప్రధానంగా పెడన నుంచి గుడివాడ వెళ్లే 216 జాతీయ రహదారి ప్రస్తుతం రెండు వరుసల రోడ్డు ఉండగా ప్రస్తుతం, రానున్న రోజుల్లో ట్రాఫిక్ పెరుగుదలను దష్టిలో ఉంచుకుని పెడన - గుడివాడ రోడ్డును నాలుగు వరుసలకు పెంచాలని ఎంపీ కొరారన్నారు. అదేవిధంగా పోర్టుకు అనుసంధానంగా పెడన బైపాస్‌కు కలిపేలా సుమారు 4 కి.మీ వరకు నాలుగు వరసల రోడ్డును నిర్మించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఇక పోర్టు నుంచి చిలకలపూడి వరకు జాతీయ రహదారిని పోర్టు నిర్మిస్తున్న గుత్తేదారు సంస్థ నిర్మిస్తామని ముందుకు రాగా.. చిలకలపూడి నుంచి విజయవాడ బైపాస్ ఎన్‌హెచ్ -65 కలిపేలా సుమారు 6 కి.మీ నాలుగు లైన్ల జాతీయ రహదారిని నిర్మించాలన్నారు. అలాగే ప్రస్తుతం నిర్మిస్తున్న చిన్నఅవుటుపల్లి - ఖాజా జాతీయ రహదారి మార్గం వీరపనేని గూడెం పక్కనే ఉన్న మర్లపాలెం, తెంపల్లి, బిబి గూడెం గ్రామాలు ఉన్నాయి కాబట్టి సుమారు 5 కిమీ వరకు సర్వీస్ రోడ్లను నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు: ఈడుపుగల్లు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో దేవినేని బాల గంగాధరావు జ్ఞాపకార్థం తనయుడు దేవినేని రాజా వితరణతో బుధవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఘంటసాల: కృష్ణానదికి వరద నీరు వస్తున్నందున ఘంటసాల మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని కష్ణానది ప్రాంతాన్ని తహసీల్దార్ విజయ ప్రసాద్ వీఆర్వో తూము శ్రీనివాసరావుతో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదీ పరివాహక ప్రాంతాలైన శ్రీకాకుళం, పాపవినావనం, గోగినేనిపాలెం గ్రామస్తులు ఎవరూ నదీ పరివాహక ప్రాంతాలకు పశువులను, మేకలను, ఇతర వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్లొద్దని కోరారు. రెవెన్యూ అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల వల్ల ఏమైన సమస్యలు ఉంటే అత్యవసర సహాయం కొరకు 9908664645 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

తోట్లవల్లూరు: కృష్ణానది పాయకు ఎగువ నుంచి వరద వస్తున్నందు వల్ల తోట్లవల్లూరు నది పరివాహక ప్రాంత ప్రజలు



పరిస్థితిని సమీక్షిస్తున్న ఘంటసాల తహశీల్దార్ విజయప్రసాద్

అప్రమత్తంగా ఉండాలని తాసిల్దారు ఎం.కుసుమకుమారి తెలిపారు. తోట్లవల్లూరు మండలంలోని నదీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడానికి అధికారులను, రెవెన్యూ యంత్రాంగాన్ని, వీఆర్వోలను నది ఒడ్డున పర్యవేక్షణకు ఉంచామని తెలిపారు. అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1070, 112, 18004250101, 9849904000 నెంబర్లను సంప్రదించాలని ఆమె తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి :యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 25వ వార్షికోత్సవం జరిగింది. యార్లగడ్డ జెండా ఆవిష్కరించారు. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పిల్లలకు అందేలా చూడాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు మోమెంటోలను అందజేస్తామని హామీ ఇచ్చారు.



విద్యార్థులు బాగా చదువుకుని చదువుకున్న పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

బుద్ధవరం-తరిగొప్పల రోడ్డు అధ్వానం



ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం బుద్ధవరం నుంచి వయా భూతిమిల్లిపాడు, తరిగొప్పల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంశం అయ్యింది. ఈ రోడ్డు అభివద్ధికి టిడిపి ప్రభుత్వం అయినా చర్యలు తీసుకుంటుందా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రయాణికులు, రైతులు కాలు మోపలేని పరిస్థితి తలెత్తింది. ద్విచక్ర వాహనచోదకులు ఆదమరిస్తే ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. రాత్రిళ్లు ఈ రోడ్డుపై ప్ర యాణం నరకాన్ని చూపిస్తోంది. దాదాపు దశాబ్దన్నర క్రితం ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో ఈ రహదారిని అభివృద్ధి చేశారు. ఐదేళ్లకు రోడ్డు పాక్షికంగా దెబ్బతింది. గత ఐదేళ్లు పారెడు మట్టి కూడా వేయలేదు. వానలకు మొత్తం లేచిపోయి గోతులు మిగిలాయి. ట్రాక్టర్ల తాకిడికి అవి రాళ్లుతేలి పెద్దవిగా మారాయి. దీంతో ఈ రహ దారిపై ప్రయాణం ప్రమాదకంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. బుధవారం నుండి తరిగొప్పల వరకు పది కిలోమీటర్ల దూరం ఉంది. రహదారికి ఇరువైపులా పంట పొలాలున్నాయి. దాదాపు రెండు వేల ఎకరాలలో వరి సాగవుతుంది. నిత్యం రైతులు పొలాలకు వెళ్తారు. రోడ్డంతా గోతులు పడటంతో నడవటానికి అగచాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళితే ఎక్కడ పడిపోతామో అన్న భయం వారిలో నెలకొంది. దీంతో చాలా మంది కష్టమైనా నడచి వెళ్తున్నారు. ఈ రహదారికి మోక్షం లేదని మదన పడు తున్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం చేయడం కష్టంగా మారింది. వ్యవసాయ ఉత్పత్తులు తీసుకెళ్లడానికి లారీలు రావటం లేదు, అందుకు కారణం రోడ్డం తా ధ్వంశం కావటమే. గత పదేళ్లలో ఈరహదారిని బాగు చేయించాలని కోరుతూ స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు నివేదించారు. గ తేడాది అధికారులు రోడ్డుకు శంకుస్థాపన చేశారు కానీ కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా వదిలేశాడు. దీంతో రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైంది. ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరు చేయించాలని అంటున్నారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు నగం పంచాయతీ పరిధిలో విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి చెత్తకుప్పలతో డంపింగ్ యార్డును తలపిస్తుంది. టీటీడీ కళ్యాణ మండపం సమీపాన జాతీయరహదారి వెంబడి ఉయ్యూరు, గండిగుంట నుంచి ట్రాక్టర్లు, తోపుడు బండ్ల పై చెత్త తీసుకువచ్చి పోస్తున్నారు. దీంతో జాతీయ రహదారి



డంపింగ్ యార్డును తలపిస్తుంది. గాలికి చెత్త లేచి రహదారిపై వెళ్లేవారి మీద పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఎసిఎస్) బలోపేతానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధ్యక్షతన జిల్లా సహకార అభివద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా పిఎసిఎస్ ల కంప్యూటరీకరణ, పిఎసిఎస్ లలో విద్యుత్, హార్డ్వేర్, పిఎం కిసాన్ సమద్ధి కేంద్రాలు, ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషది కేంద్రాల ఏర్పాటు, పిఎసిఎస్ పెట్రోల్ బంక్ ల ఏర్పాటుకు అనుమతి, మల్టీ పర్పస్ గోడౌన్ల నిర్మాణ పురోగతి తదితర అంశాలపై ఆయన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి అధికారులతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 213 పిఎసిఎస్ లను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కెడిసిసిబి)కు అనుబంధంగా కంప్యూటరీకరణ ప్రక్రియ చేపట్టామని, త్వరలోనే అది పూర్తి కానున్నట్లు అధికారులు వివరించారు. జిల్లాలోని నందమూరు, ఉల్లిపాలెం, కౌతరం, ఆముదాలపల్లి నాలుగు పీఏసీఎస్ లకు హెచ్పిసిఎల్ పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ఎన్‌ఓసి జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి కే చంద్రశేఖర్‌రెడ్డి, కేడిసిసి బ్యాంక్ సీఈవో శ్యాం కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ ఉపసంచాలకులు మనోహర్ రావు, జిల్లా ఆడిట్ ఆఫీసర్ భాస్కరరావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ వెంకట్రావు, పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ విజయ కుమారి, ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని ఎంఎల్ఎకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కంకిపాడు : చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్న పెనమలూరు మండలం పోరంకి హైస్కూల్ రోడ్డును బాగు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక ఎంఎల్ఏ బోడే ప్రసాద్‌కు సిపిఎం నేతలు వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ మాట్లాడుతూ తెల్లవారుజామున కురిసిన వానికి తాడిగడప మున్సిపాలిటీ పోరంకి నుండి నిడమానూరు వెళ్లే రోడ్డులో హైస్కూల్ వద్ద డ్రైనేజీ పొంగి వాహందారులు, పాదచారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రోజూ వందల వాహనాలు అటుగా వేల్తాయని, వేలాది మంది ప్రయాణిస్తారని తెలిపారు. ఎంఎల్ఏ ఇంటి పక్క రోడ్డే ఈ పరిస్థితిలో ఉండడం బాధాకరమన్నారు. అలాగే పోరంకి విద్యాన భారత పబ్లిక్ స్కూల్ రోడ్డు పెద్దపెద్ద గుంటలు పడి వర్షం వస్తే నీళ్లు నిలిచి స్కూల్ పిల్లలు, రజక కాలనీ, కార్మిక నగర్ నుండి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఎంఎల్ఎకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ మస్తాన్ వలి, పాండమనేని శ్రీనివాసరావు, ఐద్వా మండల కార్యదర్శి పుసులూరి పాతాళ లక్ష్మి, నాయకురాలు సిహెచ్ భవానీ పాల్గొన్నారు.



సొరంగం మార్గంలో విరిగిపడిన కొండరాళ్లు

ప్రజాశక్తి - భవానీపురం : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పశ్చిమ నియోజకవర్గంలోని సితార సెంటర్‌కు సమీపంలోని సొరంగం మార్గంలో కొండరాళ్లు జారి పడుతున్నాయి. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు బుధవారం గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని భయం భయంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. సొరంగంలోకి వెళ్లు మార్గంలో ఇటు సితార నుండి చిట్టినగర్ వైపునకు, అటు చిట్టినగర్ నుండి సితార వైపుకు ఆర్టీసీ బస్సులు, ఆటోలు, వేలాది ద్విచక్ర వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. వర్షాల కారణంగా సొరంగంలో రెండు వైపులా కొండ ప్రాంతం ఉండటంతో కొండరాళ్లు నానిపోయి పడిపోతున్నాయి. ఇటీవల సితార వైపు నుండి సొరంగంలోకి వెళ్లు మార్గంలో ఒకవైపు కొండ రాళ్లు పడకుండా ఇనుప మెష్‌ను కొంతమేర ఏర్పాటు చేశారు. ఒకవైపు మాత్రమే ఏర్పాటు చేయటం వల్ల మరో వైపు నుండి రాళ్లు జారిపడుతున్నాయి. ఇవి వాహనదారులు, పాదచారుల నెత్తిన పడితే అంతే. గతంలో ఇలా భారీ కొండ రాళ్లు పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటుచేసుకున్న విషయం తెలిసిందే. నానుడు వానల ప్రభావం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోలేదు. విఎంసి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారులు జలమయం

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలో బుధవారం కురిసిన వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. సింగవరం నుండి పెనుగంచిప్రోలు వెళ్లి రహదారిలో రోడ్లు జలమయమయ్యాయి. కన్నెవేడు గ్రామ సమీపంలో హైస్కూల్ దగ్గర డ్రెయినేజీల నుండి వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించాయి. జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆవరణంలో నీరు నిలిచిపోయాయి. కాలువలు, వాగులు పొర్లీ ప్రవహించాయి. జనజీవనం పోయింది. అక్కడ అక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. పత్తి శాలల్లో నీలి నిలిచిపోయాయి. వర్షం దగ్గు ముఖం పట్టినట్లే పట్టి బుధవారం తెల్లవారుజాము నుండి ఎడతెరపి లేకుండా కురవడంతో పత్తి పొలాలు నీరు చిచ్చుబడి కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతుల ఆందోళన చెందుతున్నారు. చెరువులకు నీరు చేరింది.

బస్టాండ్ జలమయం

తిరువూరు : తిరువూరు మండలంలో వాగులు, చెరువులు పొంగిపొర్లుతుండగా తిరువూరు పట్టణంలో బస్టాండ్ సైతం నీట మునిగింది. కొన్ని గ్రామాల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. చౌటపల్లి, అక్కపాలెం గ్రామాల్లోని వాగులపై ఉన్న లోలేవల్ బ్రిడ్జిలపై నుండి వరద ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

లింగాల బ్రిడ్జి వద్ద వరద ఉధృతి

ప్రజాశక్తి - వత్సవాయి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లింగాల బ్రిడ్జి వద్ద వరద నీరు చేరింది. తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు వరంగల్ జిల్లా పాకాల చెరువు దగ్గర నుండి వస్తున్న వరద నీరు ఖమ్మం జిల్లా మునేరు మీదుగా పోలంపల్లి రాజీవ్ మున్నేరు చెక్ డాం వరద నీరు చేరడంతో చెక్ డాం నుండి లింగాల మునేరుకు వరద నీరు చేరుతుంది. ఉదయం నుంచి వరద నీరు పెరుగుతూనే ఉంది ఈ సంవత్సర కాలంలో ఇంత వరద ఇప్పుడే రావడం ప్రథమ ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బోరులో బావుల్లో కుంటల్లోకి, వాగుల్లోకి, వరద నీరు చేరింది. బోర్లు, బావులు, మోటార్ల సహాయంతో వరి నాట్లు సిద్ధం చేస్తున్నారు పొలాలు దున్నుతున్నారు. వరి నారుమడులు పోశారు.

వైరా ఏటికి భారీగా వరద నీరు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం దామలూరు కూడలి వద్ద వైరా ఏటికి భారీ వరద నీరు చేరడంతో జలకల సంతరించుకుంది. అల్పపీడన ద్రోణితో ఎగువన కురిసిన వర్షాలకు పలు డ్యాములు నీటిని విడుదల చేయడంతో వైరా ఏటికి భారీగా నీరు చేరింది. కూడలి కాజ్ వేపై నాలుగు అడుగుల ఎత్తులో వరద నీరు పొంగిపొర్లుతుంది. నందిగామ వీరులపాడు, తెలంగాణ రాష్ట్రాలకు వెళ్లే పలు గ్రామాలకు రాకపోకలు కూడలి వైరా ఏటి వద్ద రాకపోకలు అధికారులు నిలిపివేశారు.


నందిగామలో...


తిరువూరులో నిలిచిపోయిన వర్షపు నీరు


భవానీపురంలో నిలిచిపోయిన నీరు


భవానీపురంలోని వెలంపల్లి కాలనీలో...


కంచికచర్లలో


గంపలగూడెంలో...


జగ్గయ్యపేటలో...


వత్సవాయిలో...




వత్సవాయిలో...


కంచికచర్లలో


వత్సవాయిలో...

రోడ్లు జలమయం... నివాస ప్రాంతాల్లోకి నీరు

భారీ వర్షాలకు పలుచోట్ల పశ్చిమ పలు ప్రాంతాల్లోని రోడ్లు, పల్లపు ఇళ్లు జలమయం అయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లు వర్షపు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. రాకపోకలు స్తంభించిపోయాయి.

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం పాత హౌసింగ్ బోర్డ్ కాలనీ, వెలంపల్లి కాలనీ, అప్నా బజార్, పోలీస్‌స్టేషన్ రోడ్డు, 43 మూడవ డివిజన్ ట్రాన్స్ పోర్టు కార్యాలయాల వీధి, దాని పరిసర లోటట్టు ప్రాంతాలు, విద్యాధరపురం లేబర్ కాలనీ, వన్‌టౌన్, పాతబస్తీలోని వించిపేట ప్రాంతాలు వర్షం నీటితో నిండిపోయాయి. రోడ్లు వర్షం నీటితో నిండి పోవటంతో పల్లపు నివాసాలలోకి నీరు చేరిపోయింది. దీంతో వారు మంచాలు, కీర్చుల మీదే ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం నీటితో నిండిన రోడ్లపై పాఠశాలలకు వెళ్లు చిన్నారులు, పాదచారులు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. పల్లపు ఇళ్ళలోకి వర్షం నీరు చేరిపోవటంతో నివాసితులు అధికారుల సహాయ చర్యల కోసం వేచి చూస్తున్నారు.

స్థానిక 42వ డివిజన్ మాజీ కార్పొరేటర్, టిడిపి నాయకులు యేదుపాటి రామయ్య బుధవారం పాత హౌసింగ్ బోర్డు కాలనీ, వెలంపల్లి కాలనీలోని 300, 450 ఎస్ఎఫ్‌టి కాలనిలో వర్షపు నీటి వల్లన మునిగిన ఇళ్లను పరిశీలించారు. ఇళ్ళల్లో నిలిచిపోయిన నీటిని మోటార్లు ద్వారా బయటకు పంపే విధంగా తగు చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ బ్రహ్మారెడ్డి, టిడిపి నాయకులు నెలకుర్తి వెంకట్రావ్, సీత చంద్రశేఖర్, బుజ్జి, బ్రహ్మారెడ్డి తదితరులు వున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కంచికచర్ల : రెండు రోజులగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కంచికచర్ల మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మంగళవారం 35.6, బుధవారం 36.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా వర్షం కురవటం వల్ల స్థానిక అరుంధతీ కాలనీలోకి వరద నీరు చేరింది. డ్రైనేజీ సౌకర్యం లేకపోవటంతో పడ్డ చినుకు పడాడట్టే ఎక్కడికక్కడే నిల్వచేరి కాలనీలో రోడ్ల గుండా ఇళ్లలోకి చేరింది. బుధవారం ఉదయానికే కాలనీలో ఇళ్లన్నీ నీట మునిగాయు. వంట సామాగ్రి, మంచాలు తడిచి కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఇళ్లల్లోకి చేరిన నీటిని బక్కెట్లతో తోడారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల సునీత, కార్యదర్శి వి.బ్రహ్మం ఆధ్వర్యంలో సిబ్బంది అరుంధతీ కాలనీని చుట్టేచసిన వరద నీటిని ఆయిల్ ఇంజన్లతో బయటకు తోడారు. కాలనీలో మౌలిక వసతులు లేకపోవటంతో ఏ చిన్న పాటి వర్షం వచ్చినా ఇళ్ల నీటమునిగి అగచాట్లు పడాల్సి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వసంత కాలనీలో రోడ్ల జలమయమయ్యాయి.

వీరులపాడు మండల ప్రజలకు పోలీస్ వారి హెచ్చరిక

వీరులపాడు : మండల వ్యాప్తంగా గడిచిన రెండు రోజులుగా సాధారణ నుంచి భారీ వర్షం నమోదవుతున్న నేపథ్యంలో వీరులపాడు ఎస్ఐ మహాలక్ష్ముడు మండల ప్రజలకు పలు సూచనలు చేశారు. తహశీల్దార్ రాధా కిషోర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలెవరు విద్యుత్ స్తంభాలు తాకవద్దని సూచించారు. మహిళలు దుస్తులు ఆరవేసే సమయంలో ఐరన్ వైర్లపై దుస్తులు ఆరవేయకుండా ఉండాలని. తడిగా ఉన్న ఇనుప వస్తువుల వల్ల విద్యుత్ ఘాతానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. గ్రామాల్లో వాగులు వంకలు పొంగి పొరలుతున్న నేపథ్యంలో యువకులు, చిన్నారులు ఎవరు ఈత కోసం అటువైపు వెళ్ళవద్దని సూచించారు. పల్లంపల్లి వద్ద వైరా కట్టలేరు నది వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందువల్ల రాకపోకలు నిలిపివేయడం జరిగిందని వాహనదారులు గమనించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు వేగంగా వాహనాలు నడపడం వాహనాలు జారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందువల్ల వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. రహదారి గుంతల్లో వర్షపునీరు నిలిచి ఉండటం వల్ల గుంతలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు గమనించాలని సూచించారు.

పులిచింతల ప్రాజెక్టు వద్ద జల హారతి

జగ్గయ్యపేట: పులిచింతల ప్రాజెక్టును ఆదివారం జల హారతి కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, పెద్దకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలహారతి పట్టి కృష్ణమ్మకు పసుపు, కుంకుమతో పాటు చీర, సారెలను సమర్పించి గేట్లు ఎత్తారు. అనంతరం మీడియాతో రాజగోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కృష్ణా నదిపై ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వద్ద నుండి మాదిపాడు వరకు రూ.60 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయని గత ప్రభుత్వంలో నిధులు మంజూరు అయినప్పటికీ ప్రజల యొక్క అవసరాల నిమిత్తం ఈ నిర్మాణ పనులు త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో గట్టి బందోబస్తు

పులిచింతల ప్రాజెక్టు నుండి నీటి విడుదల కారణంగా వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మండలంలోని ముంపు గ్రామాలు ముక్త్యాల, వేదాద్రి, రావిరాల గ్రామాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. నదిలోకి పశువుల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారిని వెళ్ళవద్దని గ్రామాల్లో టం టం ద్వారా తెలిపామని రెవెన్యూ అధికారులు తెలిపారు. బుధవారం ముక్త్యాల వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.

మళ్లీ లక్ష్మయ్య వాగుకు వరద

ప్రజాశక్త - కంచికచర్ల : అల్పపీడన ద్రోణి, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షానికి వాగులు పొంగి పొర్లాయి. వాగులు పొంగిపొర్లటంతో సమీప ప్రాంతాల కాలనీలు నీట మునిగాయి. సోమవారం రాత్రి నుండి ముసురు పట్టి తెరిపి లేకుండా కురుస్తునే ఉంది. రెండు రోజుల్లో సూమారు 10 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కంచికచర్ల మండలం చెవెటికల్లు వద్ద గల లక్ష్మయ్య వాగుకు బుధవారం ఉదయం భారీ వరద ప్రవహించింది. ప్రతిఏటా చిన్నపాటి వర్షానికే లక్ష్మయ్య వాగుకు వరద చేరి చెవిటికల్లు వాసులకు రాకపోకలకు ఇబ్బందులు కలగటం ఆనవాయితీగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు స్పందించి చెవిటెకల్లు లక్ష్మయ్య వాగుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మునేరుకు వరద...కీసర బ్రిడ్జి వద్ద మునేరు పరవళ్లు...

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరుకు భారీగా వరద చేరింది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్లో కురుస్తున్న వర్షాలకు వైరా, కట్టలేరు, మునేరుకు వరద చేరింది. ఈ మూడు నదుల సంగమం మండలంలోని కీసర బ్రిడ్జి వద్ద బుధవారం మధ్యాహ్నాం మునేరు వరద ప్రవాహం పెరిగింది. ఈ ఏడాది మునేరుకు భారీ వరద ఇదే కావటంతో తీర ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో మునేటి పరీవాహక ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల ఆయకట్టు సాగు నీటి కొదవ ఉండదని రైతులు అంటున్నారు.